సాక్షి ఖమ్మం

ఆదివారం ၊ 16 ၊ జూలై ၊ 2023



ఆరు లక్షల మందికి తపాలా బీమా

ఐపీపీబీలో ఖాతా కలిగిన ఆరు లక్షల మంది తపాలా బీమా పథకంలో కూడా చేరారని అధికారులు వెల్లడించారు. 8లో



'ఉన్నత'మైన ఆలోచన

చదువు మధ్యలో మానేసిన వారికి, ఉన్నత విద్య పూర్తిచేయాలనే ఆలోచన ఉన్న వారికి ఓపెన్ స్కూల్ విధానం వరంలా మారింది. 10లో

గరిష్టం / కనిష్టం 30° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల మాత్రం చిరు జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలకు హాజరైన భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణగా తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదం, స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అర్చకులు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించాక పల్లకీ సేవ నిర్వహించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు వేలాదిగా పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే విధానంలో వరి సాగు మంచిది..



పంటలను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

రఘునాథపాలెం: వరి నారు పెంచి నాట్లు వేయడం కాకుండా నేరుగా వెదజల్లే విధానమైతే రైతులకు ఖర్చు తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. మండలంలోని రాంక్యాతండా, పంగిడి, పుటానితండా, ఎన్వీ బంజర, మూలగూడెం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె పంటలను పరిశీలించారు. అదును దాటుతున్నందున వరిలో వెదజల్లే విధానం అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే, పత్తి పంటలో అంతర్ కృషి ద్వారా కలుపు తగ్గుతుందని, మిరప నారు అనుమతి ఉన్న నర్సరీల నుంచే కొనుగోలు చేయాలని డీఏఓ సూచించారు. ఏఓ భాస్కర్‌రావు, ఏఈఓ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

మధిర: మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో మధిరలో మాత్రమే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ఈనెల 25, 26, 27వ తేదీల్లో మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కేబుల్ బ్రిడ్జికి సర్వీసింగ్..



బ్రిడ్జి సర్వీసింగ్ చేస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని లకారం ట్యాంక్ బండ్‌పై నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి శనివారం నిర్వహణ మరమ్మతులు చేశారు. ప్రతీ మూడు నెలలకోసారి ఇంజనీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో బ్రిడ్జి సర్వీసింగ్ నిర్వహిస్తారు. ఈమేరకు టూరిజం శాఖ ఈడీ రామకృష్ణ, డీఈ సుమన్ చక్రవర్తి సారథ్యాన హైదరాబాద్ నుండి వచ్చిన ఆరుగురు సిబ్బంది బ్రిడ్జి తీగలు, ఇతరత్రా అణువణువూ పరిశీలించి అవసరమైన చోట సరిచేశారు. ఈపనులను కార్పొరేటర్ కర్నాటి కృష్ణ పర్యవేక్షించారు.

20నుంచి ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు



ఖమ్మం సహకారనగర్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యాన ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈమేరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని ఈనెల 20వ తేదీ నుంచి ఓటర్లకు అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఒక్కో నియోజకవర్గానికి రెండు వాహనాల కేటాయించి ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించనున్నారు.

రోజంతా ఉద్రిక్తత

భూదాన్ భూముల ఆక్రమణకు పేదల యత్నం

- వేలాదిగా ఆక్రమణదారులు.. పోలీసుల మోహరింపు
- పలు దఫాలుగా చర్చలు జరిపిన అధికారులు
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ
- కౌన్సెలింగ్ ఇస్తూ తాత్కాలిక నిర్మాణాలు కూల్చివేత

ఓవైపు ఆక్రమణ దారులు.. మరోవైపు పోలీసుల మోహరింపుతో పాటు సిద్ధంగా ఉన్న అంబులెన్స్, ఫైరింజన్, భాష్పవాయు గోళాలు.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఖమ్మం శివారులోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధి భూదాన్ భూముల వద్ద కనిపించిన పరిస్థితి ఇది. శుక్రవారం రాత్రి వరకు కంపచెట్లతో ఉన్న భూమి, పరిసరాలు, శనివారం ఉదయంకల్లా రేకుల షెడ్లతో నిండిపోగా.. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన చేరుకున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకుని ఆక్రమణదారులతో మాట్లాడగా ఆక్రమణల తొలగింపునకు ససేమిరా అనడంతో పోలీసు బలగాలను మోహరించారు. అంతేకాక కర్రలతో వేలాదిగా ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉద్రిక్తత నెలకొంది. పలు దఫాలు చర్చలు జరిపిన అధికారులు సాయంత్రం 4గంటల వరకు వారికి సమయం ఇచ్చినా వెనక్కి తగ్గలేదు. చివరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో పొక్లెయినర్ల సాయంతో గుడిసెలు, రేకుల షెడ్లను తొలగించారు.

– ఖమ్మంఅర్బన్ /ఖమ్మంమయూరిసెంటర్



గుడిసెలకు తొలగింపునకు సిద్ధమైన పోలీసులను అడ్డుకుంటున్న ఆందోళనకారులు

రాత్రికి రాత్రి గుడిసెలు..

భూదాన్ భూములు తమకు కేటాయించారని, కమిటీ ఇచ్చిన పత్రాలు తమకు అనుకూలంగా ఉన్నాయంటూ వేలాది మంది వెలుగుమట్ల రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 147, 148, 149లోని భూదాన్ భూములతో పాటు ఇతర స్థలాల్లో గుడిసెలు వేశారు. శుక్రవారం రాత్రి నుండే ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుండి పేదలు పెద్ద ఎత్తున ఆటోల్లో రేకులు, స్తంభాలు, గడలతో వచ్చి కంపచెట్లను తొలగించి షెడ్లు నిర్మించారు. రాత్రికి రాత్రే గుడిసెలు వేసిన విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసులతో చేరుకుని భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు ఉంటాయని సూచించారు. అయినా వినకపోవడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ వచ్చి ఆక్రమణదారులు, వారి నాయకులతో చర్చించి ఆధారాలు చూపిస్తే తామే స్థలం చూపిస్తామని చెప్పి సాయంత్రం నాలుగు గంటల వరకు సమయం ఇచ్చారు.

వందలాదిగా పోలీసులు

భూదాన్ భూముల్లో ఆక్రమణదారులు కర్రలు చేబూని పెద్ద సంఖ్యలో ఉండడంతో పోలీసు సిబ్బందిని కూడా మోహరించారు. జిల్లా నలుమూలల నుండి ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, రిజర్వ్‌డ్ సిబ్బందిని రప్పించి ఫైర్ ఇంజన్, అంబులెన్స్, బాష్పవాయుగోళాలను సిద్ధం చేశారు. అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యాన ఏసీపీలు గణేష్, రామోజి రమేష్, రెహమాన్, రామానుజం, ప్రసన్న తదితరులు ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ

వెలుగుమట్ల ప్రాంతంలో ఉదయం నుండి ఉద్రిక్తత నెలకొనడంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఎప్పటికప్పుడు వివరాలు ఆరా తీశారు. అయితే, ఆందోళనకారులు కర్రలతో దాడికి సిద్ధమవుతున్నారన్న సమాచారంతో కలెక్టర్, సీపీ నేరుగా వచ్చారు. తొలగింపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై రెవెన్యూ, పోలీసులకు సూచనలు చేశారు. ఇక కలెక్టర్ వెళ్లగానే అధికారులు జేసీబీలతో ముందుకు కదిలారు.

గంటల పాటు కౌన్సెలింగ్

ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు సామరస్యంగా గుడిసెవాసులను అక్కడ నుండి పంపించేందుకు అధికారులు యత్నించారు. అయితే,



షెడ్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



ఆందోళన వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

వారు వేల సంఖ్యలో ఉండడం, అధికారులు చెప్పినా ససేమిరా అనడంతో ఏసీపీ రామోజీ రమేష్, సీఐలు శ్రీధర్, రాజిరెడ్డి ఆటోకు ఏర్పాటు చేసిన మైకు ద్వారా సూచనలు చేశారు. భూములను ఆక్రమించుకోవడం నేరమని, అధికారుల విధులకు అడ్డొస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రభుత్వ సం



ఆందోళనలో సొమ్మసిల్లిన మహిళకు మంచినీళ్లు తాపిస్తున్న పోలీస్ సిబ్బంది

క్షేమ పథకాలు ఆగిపోతాయని కౌన్సెలింగ్ చేశారు. అయినా వినకపోవడంతో కార్పొరేషన్ ద్వారా జేసీబీలను పిలిపించి ముందుకు సాగుతుండగా ఆందోళనకారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదలు వేసుకున్న గూడును ఎలా తొలగిస్తారంటూ ప్రశ్నించగా.. పోలీసులు వారికి నచ్చజెప్తుతూనే మరోవైపు గుడిసెలను తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. అడ్డొచ్చిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో తోపులాట జరగగా ఒకరిద్దరు మహిళలు సొమ్మసిల్లడంతో పోలీసులే సపర్యలు చేశారు. కాగా, భూదాన్ భూములతో పాటు చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాల్లోనూ పేదలు గుడిసెలు వేయడంతో వాటి యజమానులు వందలాదిగా చేరుకున్నారు. రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసిన తమ వద్ద పత్రాలు ఉన్నాయని చెప్పడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో యజమానులు పోలీసులను ఆశ్రయింగా, గుడిసెల తొలగింపు ప్రక్రియలో వారిని భాగస్వామ్యం చేశారు.

సర్వే చేసి హద్దులు పెడతాం..



వెలుగుమట్ల రెవెన్యూలోని భూదాన్ భూములకు సంబంధించి మూడు సర్వే నంబర్లలో 62 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం. ఎవరి వద్దయినా పట్టాలు ఉండి చూపిస్తే రికార్డుల ఆధారంగా పరిశీలిస్తాం. ఈ సర్వే నంబర్లలో భూదాన్ భూమి, ప్రైవేట్ స్థలం ఎంత అనేది సర్వేతో తేలిపోతుంది.

– ఎం.శైలజ, తహసీల్దార్, ఖమ్మంఅర్బన్

డబ్బులు వసూలు చేసి..

భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకునేందుకు స్థలాలు ఇప్పిస్తామని కొందరు దళారులు పేదల నుండి డబ్బు వసూలు చేశారని పలువురు బోరున విలపించడం గమనార్హం. రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించామని పోలీస్ అధికారుల ఎదుటే వాపోయారు. గోపాలపురానికి చెందిన మల్లయ్య తన తండ్రి నాలుగేళ్ల క్రితం రూ.50 వేలు చెల్లించాడని సీపీకి మొరపెట్టుకున్నారు. ఇక ఇది భూదాన్ భూమి అని, దీనికి సంబంధించిన పత్రాలను న్యాయవాది ఆంజనేయులు సీపీకి చూపించే ప్రయత్నం చేయగా.. ఇప్పుడు చేసే పనికి ఏదైనా పత్రం ఉందా అని అధికారులు ప్రశ్నించారు.

భూదాన్ భూమి పేదల కోసం..



వెలుగుమట్ల భూదాన్ భూమిని భూదాన్ కమిటీ పేదల కోసమే కేటాయించింది. భూమి మొత్తం 62.07 ఎకరాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు గూడు కోసం కేటాయించుకోవడం జరుగుతోంది. ఎక్కడ కూడా ప్రైవేట్ వ్యక్తుల పట్టా స్థలాల్లోకి వెళ్లలేదు. కేవలం భూదాన్ భూముల్లో మాత్రమే గుడిసెలు వేసుకున్నాం.

–పడిగ యర్రయ్య, గ్రామీణ పేదల సంఘం బాధ్యులు

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఐటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్‌జైన్



పీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతీక్ జైన్, పక్కన గౌతమ్ పోట్రు

భద్రాచలం: గిరిజనుల సమగ్రాభివద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని భద్రాచలం ఐటీడీఏ నూతన పీఓ ప్రతీక్ జైన్ వెల్లడించారు. ప్రస్తుత పీఓ గౌతమ్ పోట్రు సెర్ప్ సీఈఓగా బదిలీ కాగా, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌ను పీఓగా నియమించిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీ ఏరియాలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీ, గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తూనే ప్రభుత్వ పథకాలు అందేలా పర్యవేక్షిస్తానని తెలిపారు. గిరిజనులకు సేవలందిస్తున్న అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. అందరం బాధ్యతగా పనిచేస్తూ గిరిజనులకు సేవ చేయడంలో ముందుండాలని, ప్రధానంగా విద్యా, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రతీక్‌జైన్‌తో పాటు బదిలీ అయిన పీఓ గౌతమ్‌ను భద్రాచలం ఆర్డీఓ రత్నకళ్యాణి, అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, అధికారులు రమణయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ నుంచి భద్రాద్రి..

పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్ ఢిల్లీలో జన్మించగా ఆయన విద్యాభ్యాసమంతా ఢిల్లీలోని దయానంద విహార్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగింది. ఆ తర్వాత గౌహతి ఐఐటీలో 2009 నుండి 2013 వరకు బీటెక్(ట్రిపుల్ ఈ) పూర్తిచేశారు. 2017 నుంచి 2019 వరకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చేశారు. ఆ తర్వాత సివిల్స్‌కు హాజరుకాగా జాతీయ స్థాయిలో 88వ ర్యాంకు సాధించిన ఆయన 2017 బ్యాచ్ ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం మే 2018 నుంచి జూలై 2019 వరకు అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ప్రతీక్.. జూలై 2019 నుంచి అక్టోబర్ 2019 వరకు జలశక్తి మినిస్ట్రీలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేశారు. ఆతర్వాత 9 ఫిబ్రవరి 2020 నుంచి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమితులయ్యారు.

సమావేశం లేకుండా ఎలా ఆమోదిస్తారు?

వైరా మున్సిపల్ తీర్మానాలు నిలిపివేయించిన ఎమ్మెల్సీ మధు

వైరా: వైరా మున్సిపాలిటీలో నెలకొన్న వివాదం నెలల తరబడి కొనసాగుతూనే ఉంది. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో పనులకు ఆమోదం లేక ఏ పని చేయాలన్నా ఆటంకాలు ఎదురవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. అటు అధికార పార్టీ కౌన్సిలర్లు, మరోవైపు ఆనాటి మాజీ ఎంపీ పొంగులేటి వర్గీయుల మధ్య ఏర్పడిన వివాదం ఎటూ తెగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాగా, శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేయకుండానే కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు కౌన్సిల్ తీర్మానం కాపీలు పంపించి సంతకాలు చేయాలని కోరడంతో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు సహా 12 మంది సంతకాలు చేశారు. మిగిలిన ఎనిమిది మంది కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం లేకుండా సంతకాలు ఎలా చేస్తామని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధు కమిషనర్‌ను పిలిచి సమావేశం ఏర్పాటు చేయకుండా సంతకాలు పెట్టించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇవీ ప్రతిపాదనలు

కౌన్సిలర్ల ఆమోదానికి పంపించిన వాటిలో పలు అభివృద్ధి పనుల వ్యయం, ఇతర పనులకు సంబంధించి తీర్మానాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.30 కోట్ల నుంచి వార్డుల్లో ఫాగింగ్, స్ప్రే కోసం రూ.3 లక్షలు, గ్రీన్ బడ్జెట్ రూ.62 లక్షలు, రశీదు పుస్తకాలు, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపునకు రూ.38 వేలు, బ్లీచింగ్, సున్నం కొనుగోలుకు రూ.5లక్షలు, ఫాగింగ్ యంత్రాలు కొనడానికి రూ.5 లక్షలు, కమిషనర్ కారు అద్దె అలవెన్స్ 11 నెలలకు రూ.3.63 లక్షలు, దశాబ్ది ఉత్సవాల ఖర్చులు రూ.7,17,335తో పాటు పట్టణంలో పాఠశాలలు, కళాశాలల వాల్ పెయింటింగ్స్‌కు రూ.5 లక్షలు తదితర అంశాలు ఉండగా ఆమోదానికి నోచుకోలేదు. కాగా, త్వరలో మున్సిపల్ సమావేశం నిర్వహించి బిల్లులు ఆమోదిస్తామని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి

డిప్యూటీ కమిషనర్‌గా బి.మల్లీశ్వరి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్‌గా బి.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ గ్రేడ్–2 కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను కేఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ)గా నియమించారు. ప్రస్తుతం ఏఎంసీగా ఉన్న బి.మల్లీశ్వరి గతంలో ఎంపీడీఓగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై కేఎంసీకి వచ్చారు. అయితే, సత్యనారాయణరెడ్డిని అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించిన నేపథ్యాన, మల్లీశ్వరిని కేఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ మరో ఉత్తర్వు విడుదల చేశారు. కాగా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ) ఎన్నికల విధుల్లో ఏఆర్‌ఓ బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో మల్లీశ్వరిని ఏఎంసీ బాధ్యతల నుండి తప్పించి డిప్యూటీ కమిషనర్‌గా నియమించినట్లు తెలిసింది.



బి.మల్లీశ్వరి

వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలి : డీడీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈమేరకు ప్రతీ హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే, పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వార్డెన్లు సమయపాలన పాటిస్తూ పర్యవేక్షించాలని సూచించారు.



భద్రాచలంలో గోదావరిపై బ్రిడ్జి, పక్కన కొత్త బ్రిడ్జి నిర్మాణానికి జరుగుతున్న పనులు

నా వయస్సు 58ఏళ్లు!

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రాముల వారి దర్శనం ఒకప్పుడెంతో కష్టం. అప్పట్లో వాహన రాకపోకలు ఉండేవి కావు. ఏటా శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు భద్రాచలం గోదావరి అవతల బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి కాలినడకన, ఆపై పడవలో ప్రయాణించేవారు. అలా వస్తున్న 150 మంది భక్తులు ఓసారి నీట మునిగి కన్నుమూయడంతో వారధి నిర్మాణం ఆవశ్యకతను పాలకులు గుర్తించారు. ఈమేరకు గోదావరిపై నిర్మించిన వంతెనను ప్రారంభించి ఈ నెల 13న 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారధి స్వగతం ఇలా..!

– భద్రాచలం అర్బన్

- లక్షలాది మంది రాకపోకలకు సహకరించా..
- అయినా నాలో సత్తా తగ్గలేదు
- మిత్రుడు కూడా అందుబాటులోకి వస్తే తగ్గనున్న భారం
- భద్రాద్రిలో గోదావరిపై వారధి స్వగతమిది !!

ఆ ప్రమాదంతో వంతెనకు శ్రీకారం...


అప్పటికి నేను లేను కానీ.. 1959లో శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులు రెండు పడవలను కట్టుకుని గోదావరి నదిపై భద్రాచలం వైపు వస్తుండగా మునిగిపోయారట. ఆ ఘటనలో సుమారు 150 మంది నీట మునిగి చనిపోగా అప్పటి ప్రభుత్వం గోదావరి నదిపై నా నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేయగా.. డిజైన్, నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను ముంబైకి చెందిన పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అప్పగించారు. 1959 డిసెంబర్ 16న నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేయగా, 1965 జూలై 13న రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. అంటే ఆరేళ్ల సమయం పట్టింది.

ఎన్నో వరదలను చూశా..

గోదావరి వరద గత ఆరున్నర దశాబ్దాల్లో 11సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటింది. జూలైలోనే గోదావరి 11సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటడమే కాకుండా ఇందులో నాలుగుసార్లు తుది ప్రమాద హెచ్చరిక(53అడుగులు) సైతం దాటడం గమనార్హం. 1972 జూలై 6న 44.3 అడుగుల గోదావరి నీటి మట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 29న 54.3, 2002 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 57, 2013 జూలై 24న 56.7, 2016 జూలై 12న 52.4 అడుగుల నీటిమట్టం నమోదైంది. కాగా గత ఏడాది జూలై 16న 71.3 అడుగులుగా నమోదైంది. ఇలా ఎన్నో వరదలతో పాటు గోదావరి ఎండిపోయి ఇసుక తిన్నెలు తేలడాన్ని కూడా చూశాను.

రూ.70 లక్షలతో నిర్మాణం

భద్రాచలం వద్ద గోదావరి నదిపై నా నిర్మాణానికి రూ.70లక్షలు వెచ్చించారట! 3,934 అడుగుల పొడవు, 37 పిల్లర్లు, ఒక్కో పిల్లర్ మధ్య 106.6 అడుగుల దూరంతో నిర్మించారు. ఇప్పటికీ నేను పటిష్టంగానే ఉన్నాను. లక్షల వాహనాలు.. అంతకు మించి భక్తుల రాకపోకలకు వారధిగా నిలిచాను. అయినా ఏనాడు మొరాయించలేదు.. ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. నాకు ఇంకా సామర్థ్యం ఉన్నా.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా పక్కనే మరో మిత్రుడి(బ్రిడ్జి) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానం చేసేలా ఈ బ్రిడ్జి పనులు 2015 ఏప్రిల్‌లో మొదలుకాగా.. సుమారు రూ.100కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయగా ముంబైకే చెందిన రాజ్‌దీప్ సంస్థ రూ.65 కోట్లతో పనులను దక్కించుకుంది. రకరకాల కారణాలతో ఆలస్యమవుతూ వస్తుండడంతో ఓసారి కాంట్రాక్ట్ సంస్థకు రూ.6.50 కోట్ల జరిమానా విధించి వసూలు చేశారట. చివరకు గడువు పెంచి సదరు సంస్థతోనే ఇంజనీరింగ్ అధికారులు పనులు చేయిస్తుండడంతో 90 శాతం మేర పూర్తయ్యాయి. ఈ బ్రిడ్జి కూడా త్వరగా పూర్తయితే నాపై భారం తగ్గి మరికొన్నాళ్ల భక్తులు, ప్రయాణికులకు సేవలందించే అవకాశం దక్కుతుంది.



సారపాక నుంచి భద్రాచలం వెళ్లే బ్రిడ్జి ద్వారం, అటు ఇటూ శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలా ఫలకాలు

నాలుగు రాష్ట్రాల ప్రజలకు సేవ..

భద్రాచలం పట్టణంలో గోదావరిపై 1965లో నిర్మించిన నా ద్వారా నాలుగు రాష్ట్రాల ప్రజల రవాణా కోసం సేవలందిస్తున్నా. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వచ్చివెళ్లే వారికి 58 ఏళ్లగా వారధిగా నిలుస్తున్న చరిత్ర నా పేరిట ఉంది. అప్పుడప్పుడు చిన్న చిన్న మరమ్మతులు తప్ప ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. కాకపోతే 1986లో మొదటిసారి 75.6 అడుగుల వరద వచ్చినప్పుడు ఉన్నతాధికారులు రాకపోకలను నిషేధించారు. మళ్లీ గత ఏడాది కూడా దాదాపు 35 ఏళ్ల తర్వాత భారీగా వరద రావడంతో రాకపోకలను అనుమతించలేదు. ఆ తర్వాత వరద తగ్గగానే మళ్లీ సేవలందిస్తున్నా!

క్లుప్తంగా

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన



విద్యార్థులతో చైర్మన్, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: విద్యార్థుల భాషాభివృద్ధి, జ్ఞాన సముపార్జనకు పాఠశాలల్లోని గ్రంథాలయాలు దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లిలోని పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంలో నాటికలు ప్రదర్శించగా పలువురు అభినందించారు. ఆ తర్వాత వివిధ పోటీల్లో విజేతలకు చైర్మన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్, బొల్లేపల్లి మధుసూదన్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కకు సన్మానం



భట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న దుర్గాప్రసాద్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పేరిట చేపట్టిన 1,364 కిలోమీటర్ల పాదయాత్ర ఇటీవల పూర్తి కాగా తొలిసారి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు కలిసి సన్మానించారు. అలాగే, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొంటిముక్కల నాగేశ్వరరావుకు దుర్గాప్రసాద్ నియామకపత్రం అందించారు. కార్యక్రమాల్లో నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావీద్, మొక్కా శేఖర్‌గౌడ్, రబ్బానీ, రెంటాల ప్రసాద్, సయ్యద్ మహ్మద్, వసీం, బాలశౌరి, బాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రామనాథంను అభినందించిన చంద్రబాబు



రామనాథంను అభినందిస్తున్న చంద్రబాబు

ఖమ్మంఅర్బన్: టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ వాసిరెడ్డి రామనాథంను శనివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి రామనాథంకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల ఐలయ్య, కనగాల సాంబశివరావు, మల్లాది హనుమంతురావు, హరికృష్ణ, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్, పోలీసు అధికారుల తనిఖీలు



విజయవాడ వైపు వెళ్తున్న బస్సును తనిఖీ చేస్తున్న సిబ్బంది

పెనుబల్లి: గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఎక్సైజ్, పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. శనివారం విజయవాడ – భద్రాచలం జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలన్నిటినీ తనిఖీ చేసి ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు.

పట్టపగలు బాలికపై దాడి

నేలకొండపల్లి: ఓ కాంప్లెక్స్‌ను అడ్డాగా చేసుకుని ఉంటున్న యువకుల్లో ఒకరు పట్టపగలే బాలికపై దాడి చేసి వేధించాడు. దీనిని అడ్డుకోబోయిన వ్యాపారిపై సైతం దాడికి ప్రయత్నించగా పోలీసుల రంగప్రవేశంతో పరారయ్యారు. నేలకొండపల్లిలోని ఓ కాంప్లెక్స్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. శనివారం మండల కేంద్రానికి చెందిన బాలికను ఓ యువకుడు కాంప్లెక్స్ కింద ఫ్లోర్‌కు తీసుకెళ్లి వేధిస్తున్నాడు. గమనించిన వ్యాపారి సంజయ్ అడ్డుకోవడంతో సదరు యువకుడు బెదిరించాడు. ఎట్టకేలకు బాలిక అక్కడి నుంచి తప్పించుకుంది. దీంతో ఆగ్రహించిన సంజయ్‌తో యువకుడు వాగ్వాదానికి దిగడమే కాక మరో ఐదుగురు స్నేహితులను తీసుకొచ్చి దాడికి యత్నించారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిబ్బంది చేరుకునేలోగా యువకులు జారుకున్నారు. పోలీసులు పలువురిని విచారించి వివరాలు సేకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

తపాలా బ్యాంకు ద్వారా 6 లక్షల మందికి బీమా

- రూ.399తో రూ.10 లక్షల బీమా నదుపాయం
- అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా పథకం
- ఐపీపీబీ తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్



మాట్లాడుతున్న ఐపీపీబీ తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్, పక్కన అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ)లో ఖాతా కలిగిన వారికి తపాలా శాఖ కల్పించిన బీమా పథకంలో తెలంగాణ తపాలా సర్కిల్ పరిధి నుంచి ఆరు లక్షల మంది చేరారని ఐపీపీబీ తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భూక్యా భాస్కర్‌నాయక్ వెల్లడించారు. శనివారం ఖమ్మం గాంధీచౌక్‌లోని తపాలా డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భాస్కర్‌నాయక్ మాట్లాడారు.

18–65 ఏళ్ల వారు అర్హులు

టాటా, బజాజ్ కంపెనీలకు చెందిన గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని ఐపీపీబీ ద్వారా నిర్వహిస్తున్నామని భాస్కర్ తెలిపారు. టాటా కంపెనీ ద్వారా ఏడాదికి రూ.399, బజాజ్ కంపెనీ ద్వారా పథకానికి రూ.396 చెల్లిస్తే 18–65 ఏళ్ల మధ్య వయస్కులు బీమా పథకాలకు అర్హులని చెప్పారు. ఏడాదిగా ఈ పథకాన్ని అమలుచేస్తుండగా తెలంగాణ సర్కిల్‌లో మృతి చెందిన 23 మంది కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున బీమా పరిహారం అందజేశామని తెలిపారు. కాగా, ఈ పథకంలో చేరిన వారు ప్రమాదాలకు గురైన వారికి ఆస్పత్రిలో చేరితే రూ.60 వేలు, ఆస్పత్రి బయట ఉంటే రూ.30 వేలు అందిస్తున్నామని చెప్పారు. ఇంకా కుటుంబంలో ఇద్దరు పిల్లల చదువులకు రూ.లక్ష వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇవేకాక రూ.5,168తో సహజ మరణాలకు రూ.10 లక్షలు బీమా వర్తించే సౌకర్యం కూడా ఉందని వివరించారు. కాగా, తెలంగాణ ఐపీపీబీ సర్కిల్‌లో మొత్తం 36 లక్షల మంది ఖాతాదారులు ఉండగా, జనాభా ప్రాతిపదికలో ఐపీపీబీ ఖాతాల్లో ఖమ్మం డివిజన్ అగ్రభాగాన ఉందని తెలిపారు. అంతేకాక ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లో చేర్చే ప్రక్రియలోనూ తెలంగాణ సర్కిల్ ప్రథమ స్థానంలో నిలుస్తోందని వివరించారు. సమావేశంలో ఖమ్మం తపాలా డివిజన్ పోస్టల్ సూరింటెండెంట్ బి.రవికుమార్, జనరల్ ఇన్సూరెన్స్ సమన్వయకర్త లింగస్వామి, ఖమ్మం డివిజన్ ఐపీపీబీ మేనేజర్ అనిల్‌కుమార్, గాంధీచౌక్ ఎస్‌పీఎం వెంకట్రాములు, పీఆర్వో పమ్మి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల తపాలా బీమా చెక్కు అందజేత

తిరుమలాయపాలెం: మండలంలోని పైనంపల్లికి చెందిన రంగు గోవర్ధనాచారి తపాలా శాఖ ద్వారా బీమా చేయించుకోగా, ఆయన ఇటీవల మృతి చెందారు. మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ శనివారం మృతుడి భార్య ఉమారాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.399 ప్రీమియంతో అమలు చేస్తున్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా వైద్య ఖర్చులతో పాటు రూ.10 లక్షల బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు అనిల్‌కుమార్, వై.కోటేశ్వర్, నారాయణరావు, పవన్‌కుమార్, ఎంపీటీసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వైద్యులదే కీలక పాత్ర

- మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ
- అనస్తీషియన్ల రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న పువ్వాడ జయశ్రీ, వైద్యులు

ఖమ్మంఅర్బన్: వైద్య రంగంలో మత్తు వైద్యులదే కీలకపాత్ర అని మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఖమ్మం మమత ఆస్పత్రిలోని పువ్వాడ ఆడిటోరియంలో అనస్తీషియన్ల ఎనిమిదో రాష్ట్రస్థాయి సదస్సు శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చికిత్స కోసం వ్యక్తి పరిస్థితి ఆధారంగా మత్తు మందు ఇవ్వడం, ఆపై చికిత్స చేయడంలో అనస్తీషియన్లు సైతం జనరల్ ఫిజీషియన్ల మాదిరే వైద్య సేవలను అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సేవలను అందించాలని సూచించారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఐసీయూ, శస్త్ర చికిత్సల్లో మత్తు వైద్యులే కీలకమని చెప్పారు. సదస్సులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్యులు పలువురు అనస్తీషియా విభాగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, సాంకేతికతను వివరించగా, పీజీ విద్యార్థులు రూపొందించిన పేపర్లు సమర్పించారు. కార్యక్రమంలో ఐఎస్ఏ జాతీయ కార్యదర్శి డాక్టర్ సుక్మీందర్ జిత్సింగ్, ఐఏసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రామకృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ బాగం కిషన్‌రావు, కార్యదర్శి టి.సురేశ్‌తో పాటు రవి, ఎం.కోటేశ్వరరావు, మమత ఆస్పత్రి ప్రిన్సిపాల్ టి.అనిల్‌కుమార్, చింతల కిషన్, పంకజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వైద్య, ఆరోగ్య శాఖ జేఏసీ



ఎమ్మెల్సీ మధుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: జీపీఎస్ మ్యాప్ కెమెరా ద్వారా హాజరు నమోదు నుంచి వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చేలా కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ జేఏసీ బాధ్యులు కోరారు. శనివారం ఖమ్మంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఆరోగ్య పథకాల నిర్వహణతో ఒత్తిడికి లోనవుతున్న తమకు ఫేస్ అటెండెన్స్ యాప్ ద్వారా మరింత ఇబ్బంది ఎదురవుతోందని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్సీ.. ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, వేణుగోపాల్, వెంకటరమణ, శ్రీనివాస్, జైపాల్, శ్రీకర్, పద్మావతి, నిర్మల, నర్సింహారావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఖమ్మంవైరారోడ్డు: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ తాత మధుసూదన్ శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అందజేశారు. తన సిఫారసులతో రూ.18,53,700 విలువైన చెక్కులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, ముత్యాల సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, ఉమశంకర్, పసుపులేటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ



వార్డెన్ నుంచి వివరణ తీసుకుంటున్న ఏఎస్‌డబ్ల్యూఓ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ సంక్షేమశాఖ ఆనందనిలయం బాలుర వసతిగృహంలో విద్యార్థిపై వార్డెన్ చేయి చేసుకున్న ఘటనకు సంబంధించి ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత శనివారం విచారణ జరిపారు. వసతిగృహానికి వచ్చిన ఆమె విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే, విద్యార్థిని ఎందుకు కొట్టారో చెప్పాలని, సమాధానంగా లేఖ ద్వారా వివరణ ఇవ్వాలని వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం లేఖలను ఆమె ఎస్సీ డీడీకి అందజేసినట్లు సమాచారం. ఈ విషయమై డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ బాలుర 'బీ' వసతిగృహంలో విద్యార్థిపై చేయి చేసుకున్న ఘటనకు సంబంధించి వార్డెన్‌తో పాటు పర్యవేక్షణలో విఫలమైన ఏఎస్‌డబ్ల్యూఓకు మెమో ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల నేలకొండపల్లి చెరువుమాధారం వసతిగృహంలో జరిగిన ఘటనకు సంబంధించి అక్కడి వార్డెన్‌కు సైతం మెమో జారీ చేశామని చెప్పారు.

అధికారి ఉండగానే..

ఎస్ఎస్‌పీ క్యాంపులో ఎస్సీ బాలుర బీ, సీ, ఆనందనిలయం వసతిగృహాలు ఉన్నాయి. 'బీ' వసతిగృహానికి ప్రత్యేకంగా వార్డెన్ ఉండగా.. సీ, ఆనందనిలయానికి ఒక్కరే వార్డెన్ ఉన్నారు. అయితే, ఈ రెండు హాస్టళ్ల విద్యార్థులకు వేర్వేరుగా వంట చేయాల్సి ఉన్నా ఒక దగ్గరే చేస్తున్నారు. అనాథలు, పాక్షిక అనాథ పిల్లలు ఉండే ఆనందనిలయం విద్యార్థులను ప్రత్యేక సంరక్షణలో చూసుకోవాల్సిన వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉండగా.. ఏఎస్‌డబ్ల్యూఓ సైతం చూసీడనట్లు వ్యవహరించారు. ఇదేవిషయమై ఆరా తీస్తే అప్పటికప్పుడు గ్యాస్ స్టవ్ తెప్పించారు.

గంజాయితో పట్టుబడిన యువకుల రిమాండ్

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట సర్కిల్ ఏరియాలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన దారాగాని వెంకటసాయి యశ్వంత్, షేక్ సోయల్ పాషాను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. యువకులిద్దరు రెండు కేజీల గంజాయితో వచ్చి శుక్రవారం రాత్రి అమ్ముతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

డిగ్రీ విద్యార్థి వద్ద 200 గ్రాముల గంజాయి

తిరుమలాయపాలెం: డిగ్రీ విద్యార్థి నుంచి 200 గ్రాముల గంజాయిని తిరుమలాయపాలెం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సోలీపురం శివారు పీక్యాతండాకు చెందిన బానోతు వంశీ ఖమ్మంలో డిగ్రీ చదువుతుండగా, శనివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై బీరోలు వైపు నుంచి దమ్మాయిగూడెం వైపు వస్తుండగా తనిఖీలు చేశారు. దీంతో అతడి వద్ద 200 గ్రాముల గంజాయి లభించడంతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ తెలిపారు. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు అంగీకరించాడని ఎస్‌ఐ చెప్పారు.

మహిళా కానిస్టేబుల్‌కు టోకరా

బంగారు మెరుగు పేరిట మోసం

కల్లూరు: బంగారు ఆభరణాలకు మెరుగుపెడతామని చెప్పిన ఇద్దరు వ్యక్తుల మాటలు నమ్మిన ఓ మహిళా కానిస్టేబుల్ మోసపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరు శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి రమాదేవి సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవలే సెలవుపై ఆమె కల్లూరు రాగా, శుక్రవారం ఉదయం ఆమె ఇంటికి ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చారు. హిందీలో మాట్లాడిన వారు బంగారానికి మెరుగు పెడతామని చెప్పడంతో ఆమె తన 40 గ్రాముల గొలుసు ఇచ్చింది. ప్రత్యేక ద్రావణంలో గొలుసును మెరుగుపట్టినట్లుగా నమ్మించిన వారు వెళ్లిపోయారు. దీంతో అనుమానం వచ్చిన రమాదేవి గొలుసును తూకం వేయించగా 15 గ్రాములే ఉంది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రఘు తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

భద్రాచలంటౌన్: ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి ఎండు గంజాయిని పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలో తనిఖీలు చేస్తుండగా రెండు బైక్‌లపై వెళ్తున్న ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి బ్యాగులను తనిఖీ చేయగా 12.5 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అధికారులు తిరుపతి, కరంచంద్, నాగేందర్ రెడ్డి, సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, రహీమున్నిషా బేగం, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై ఎన్‌జీటీ విచారణ



క్వారీ వద్ద విచారణ చేస్తున్న అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచెలక రెవెన్యూ పరిధి పువ్వాడనగర్ వద్ద మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన ఫిర్యాదులతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నియమించిన త్రిసభ్య కమిటీ శనివారం విచారణ చేసింది. హైదరాబాద్ జాయింట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి కృపాకర్, ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్డీఓ సూర్యనారాయణ, మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ ఆధ్వర్యాన తవ్వకాలు జరిగిన ప్రాంతం, రికార్డులను పరిశీలించారు. గతంలో ఈ క్వారీలో అక్రమ తవ్వకాలు జరిగాయని మైనింగ్ అధికారులు గుర్తించి లీజుదారుడికి రూ.16 కోట్లు జరిమానా సైతం విధించారు. దీనిపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఇంతలోనే అనుమతికి మించి తవ్వకాలు చేపట్టడమే కాక అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఎన్‌జీటీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేయగా, నివేదికను కోర్టుకు సమర్పిస్తామని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారి కృపాకర్ తెలిపారు. తనిఖీల్లో మైనింగ్ ఆర్ఐ గంగాధర్, సర్వేయర్, రఘునాథపాలెం ఆర్ఐ ప్రసాద్, కార్పొరేటర్ మలీదు జగన్, తుంబూరు దయాకర్‌రెడ్డి, గణేశ్, మందడపు నాగేశ్వరరావు, స్వాతి, ఫిర్యాదుదారుడు కోయిని వెంకన్న, మందా బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా సారంగపాణి

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా సాధుల సారంగపాణి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వర్తించిన రామోజీ రమేష్ ఉద్యోగోన్నతిపై వెళ్లాక ఈ పోస్ట్ ఖాళీగా ఉంది. ఈమేరకు శనివారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా 42మంది డీఎస్పీలను బదిలీ చేయగా, వెయిటింగ్‌లో ఉన్న సారంగపాణిని ట్రాఫిక్ ఏసీపీగా నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఖమ్మం సీటీసీలో ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటస్వామిని జగిత్యాల డీఎస్పీగా బదిలీ చేశారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మోకాళ్ల మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సింగరేణి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన మహేశ్ తన ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై ఈనెల 11న ఖమ్మం వెళ్తున్నాడు. ఈ క్రమంలో రఘునాథపాలెం బైపాస్ నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

సత్తుపల్లి టౌన్: వివాహితను లైంగికంగా వేధించిన వ్యక్తిపై శనివారం కేసు నమోదైంది. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన పానెం రమేష్ లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వంద మందిపై కేసు నమోదు



గుడిసెల తొలగింపును పర్యవేక్షిస్తున్న సీపీ వారియర్, అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో గుడిసెలు వేసిన విషయమై వంద మందికి పైగా వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని రెచ్చగొట్టి భూదాన్ భూముల్లో గుడిసెలు వేసేందుకు ప్రోత్సహించడమే కాక వాటిని తొలగించే క్రమంలో అధికారులను అడ్డుకున్న విషయమై ఈ కేసులు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు. ఈ అంశంపై విచారణ సాగుతోందని, ఇంకా మరికొందరిపై కేసు నమోదు చేసే అవకాశముందని ఆయన వెల్లడించారు.



గుడిసెలు తొలగించాక భూదాన్ భూమి



భూదాన్ భూముల్లో గుడిసెలు వేసేందుకు వస్తున్న పేదలు



రేకుల షెడ్ నిర్మిస్తున్న దృశ్యం



చేతిలో కర్ర లాక్కుంటున్న మహిళా పోలీస్

క్లుప్తంగా...

మరో 23మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశాల నేపథ్యంలో వరుసగా రెండో రోజూ పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. 23 మందిని బదిలీ చేసి అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలుగా పోస్టింగులివ్వగా, మరో 9 మందిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

43 మంది డీఎస్పీలకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 43 మంది డీఎస్పీల(సివిల్)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

22 మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ పురపాలక సంస్థల్లో పనిచేస్తున్న 22 మంది మునిసిపల్ కమిషనర్లను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి పాత పింఛన్ సాధన రథయాత్ర: స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం నుంచి పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర నిర్వహించనున్నట్టు తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ యాత్ర సాగుతుందని, ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రం నుంచి ప్రారంభమై ఈనెల 31న యాదాద్రి నరసింహుని సన్నిధిలో ముగుస్తుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించే పాత పింఛన్ ఆవశ్యకతను తెలియజెప్పడంతో పాటు పాత పింఛన్ అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. తమ డిమాండ్‌కు ఇప్పటికే టీజీవో, టీఎన్జీవో సహా పలు సంఘాలు మద్దతిచ్చాయని, పాత పింఛన్ పొందుతున్న ఉద్యోగులు కూడా ఈ యాత్రకు మద్దతివ్వాలని కోరారు. కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దుతో రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత చేకూరుతుందన్నారు.

బాత్రూమ్‌లో బీ కేర్‌ఫుల్

ఇళ్లలో రెండో అత్యంత ప్రమాదకర ప్రదేశం

- అనేక మంది ప్రముఖులు బాత్రూమ్ ప్రమాదాల్లోనే మృతి
- ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 60 ఏళ్లు దాటిన వారే ఎక్కువ



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 ఏళ్లు పైబడిన వారిలో 2.35 లక్షల మంది బాత్రూమ్‌లో గాయపడుతున్నారని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక చెబుతోంది. ఇంట్లో అతి చిన్న గదే అయినప్పటికీ.. వంటగది తరువాత బాత్రూమ్ అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. బాత్రూమ్‌లో సంభవించే ప్రమాదాల కారణంగా ఒక్క యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోనే నిత్యం 347 మంది మరణిస్తున్నారు. మన దేశంలో ఎముకల చికిత్స కోసం వెళుతున్న వారిలో దాదాపు 35నుంచి 45 శాతం మంది బాత్రూమ్‌లో జారిపడి గాయాల పాలైనవారే. ప్రముఖ సినీ నటి శ్రీదేవి దగ్గర్నుంచి తాజాగా చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు వరకూ అనేక మంది ప్రముఖుల మరణాలు బాత్రూమ్‌లోనే సంభవించాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వదులుగా ఉన్న టాయిలెట్ బౌల్ రిమ్‌పై కూర్చోవడం వల్ల అది అటూ ఇటూ కదిలి శరీరానికి గాయం చేయవచ్చు. ప్లాస్టిక్ సీట్లు పగిలిపోవడం, వ్యక్తి బరువు వల్ల కూలిపోవడం కూడా గాయాలు కలిగించవచ్చు. టాయిలెట్లలో సిగరెట్లు వంటివి పడేయడం వల్ల అవి పేలిపోయే ప్రమాదం కూడా ఉంది. కోసుకుపోవటం, ఎముకలు విరగటం, వెన్నెముకకి గాయాలు, ఫ్రాక్చర్లు, వంటివి మామూలే. సాధారణంగా బాత్రూమ్ ప్రమాదాలు మనం టబ్‌లోంచి బయటకు వస్తున్నప్పుడో, టాయిలెట్ సీటుపై కూర్చున్నప్పుడో, తువ్వాలు తీసుకుంటున్నప్పుడో లేదా జారుడు నేలపై నడిచినప్పుడో జరుగుతాయి. ఇలాంటివి ఆపాలంటే బాత్రూమ్ వాడుతున్నప్పుడు లైట్లు, డోర్ మ్యాట్లు వేయాలి. బాత్రూమ్ నేలను పొడిగా ఉండేలా చూసుకోవడంతో పాటు, పట్టుకోడానికి హ్యాండిల్స్ పెట్టించాలి. పాశ్చాత్య టాయిలెట్‌లో కూర్చుని లేచే సమయంలో హేండిల్ పట్టుకుని లేవాలి. బాత్రూమ్‌కి వెళ్లినప్పుడు లోపల గట్టిగా గడియపెట్టుకోవకపోవడం వృద్ధులకు మంచిది. షవర్ కింద స్నానం చేసే సమయంలో స్టూల్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేసినప్పుడు ముందుగా తలపై కాకుండా పాదాలపై నీటిని పోసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చరిత్రలో కొన్ని దుర్ఘటనలు

- చైనాలోని జిన్ రాష్ట్ర పాలకుడు క్రీస్తు పూర్వం 581లో టాయిలెట్ పిట్‌లో పడి మరణించాడు.
- చరిత్రలో మర్చిపోలేని దుర్ఘటన ఒకటి 1184న జూలై 26న సంభవించింది. 'ఎర్ఫర్ట్ లెట్రిన్ విపత్తు'గా పిలిచే ఈ ప్రమాదం రోమన్ చక్రవర్తి హెన్రీ అనధికార సమావేశం నిర్వహిస్తుండగా.. దానికి హాజరైన వారి బరువు కారణంగా చెక్క భవనం రెండవ అంతస్తు నేల కూలిపోయింది. కొంతమంది గ్రౌండ్ ఫ్లోర్ కింద ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడి మునిగిపోవడంతో 60 మంది మరణించారు.
- 1760లో గ్రేట్ బ్రిటన్‌కు చెందిన కింగ్ జార్జ్ అక్టోబర్ 25న టాయిలెట్‌లో మరణించాడు.
- 1945లో జర్మన్ జలాంతర్గామి ఒక టాయిలెట్ ప్రమాదంలో మునిగిపోయింది.
- 1983 జూన్ 2న ఎయిర్ కెనడా విమానం -797 వెనుక లావెటరీలో మంటలు చెలరేగి విమానం మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో 23 మంది మరణించారు.
- బ్రిటిష్ వ్యాపారవేత్త, కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు క్రిస్టోఫర్ షేల్ జూన్ 26, 2011న గ్లాస్టన్‌బరీ ఫెస్టివల్‌లో పోర్టబుల్ టాయిలెట్‌లో గుండెపోటుతో చనిపోయాడు.
- టాయ్‌లెట్ల ఫిట్టింగ్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల ఏటా దాదాపు 10 వేల ఓడలు ప్రపంచవ్యాప్తంగా మునిగిపోతున్నాయి.

అప్రమత్తంగా ఉండండి



'బాత్రూమ్' మరణాల్లో ఎక్కువ శాతం హార్ట్ అటాక్ వల్లే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం చల్లని నీటితో తలస్నానం చేసినప్పుడు.. ఆ నీటిని తలపై పోసుకుంటే శరీరంలో ఆ భాగం చల్లగా మారుతుంది. దీంతో రక్తనాళాలు వెంటనే అలర్ట్ అయ్యి రక్తాన్ని ఒక్కసారిగా పైకి పంపిస్తాయి. దీనివల్ల తల భాగం వైపు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా ఒక్కసారిగా బ్లడ్ ప్రెషర్ పెరిగి హార్ట్ అటాక్ వస్తుంది. కొన్నిసార్లు పక్షవాతం కూడా రావచ్చు. జారి పడిపోయినప్పుడు తల నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. వెన్నుపూస కూడా విరగవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ సుధాకర్ కనపర్తి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు, విజయవాడ

వృద్ధుల ప్రాణాలు తీస్తున్నాయ్



ఇంట్లో 65 ఏళ్లు పైబడిన పెద్దవారు ఉంటే.. బాత్రూమ్ ప్రమాదాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. ప్రతి నలుగురిలో ముగ్గురు వృద్ధులు ఏడాదికి ఒకసారైనా బాత్రూమ్‌లో జారిపడే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల్లో 65 శాతం చిన్న గాయాలతో సరిపెట్టినా.. మిగతా 35 శాతం మాత్రం ప్రాణాలు తీస్తున్నాయి. మన దేశంలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలో 42 శాతం మంది టాయిలెట్లలో 7 నుంచి 10 సార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. 58 శాతం మంది 11 నుంచి 15 సార్లు పడిపోతున్నారు. సరైన తలుపులు లేకపోవడం ప్రమాదానికి వంద శాతం కారణమవుతుండగా, జారే ఫ్లోర్ 91.9 శాతం, బాత్రూమ్ పరిమాణం 80.3 శాతం, ఎత్తైన తలుపు థ్రెషోల్డ్ 53.5 శాతం, నాన్-స్కిడ్ మ్యాట్ లేకపోవడం 99.5 శాతం, గ్రాబ్ బార్‌లు లేకపోవడం 97 శాతం, ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేకపోవడం 96.6 శాతం, బాత్రూమ్‌లో వెలుతురు సరిపోకపోవడం వల్ల 94.4 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. వేడి నీటి వినియోగం 89.9 శాతం, సీట్ ఉపరితలం 55.6 శాతం, ప్రవేశ ద్వారం వద్ద లైట్ స్విచ్ లేకపోవడం 53 శాతం, చిందరవందరగా ఉన్న మార్గం వంటివి 39.4 శాతంకారణమవుతున్నాయి. ఎన్‌సీబీఐ మార్కెటింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. 11 శాతం హార్ట్ అటాక్‌లు బాత్రూమ్‌లోనే వస్తున్నాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు లేదా స్నానం చేస్తున్న సమయంలో ఇవి సంభవిస్తున్నాయి.

ఆస్ట్రేలియాకు మేడిన్ ఏపీ ఈ-స్కూటర్లు

- కాన్‌బెర్రాకు ఎగుమతి చేయనున్న అవెరా సంస్థ
- పైలట్ ప్రాజెక్టు కింద తొలుత 100 ఈ-స్కూటర్ల ఎగుమతి



సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా రోడ్లపై మేడిన్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు దూసుకుపోనున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నున్న సమీపంలోని విద్యుత్ వాహనాల తయారీ సంస్థ 'అవేరా'తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆస్ట్రేలియాలో అడుగుపెడుతోంది. కాన్‌బెర్రా రాష్ట్రానికి పైలట్ ప్రాజెక్టు కింద 100 ఎలక్ట్రిక్ స్కూటర్లను అవేరా సంస్థ ఎగుమతి చేయబోతోంది. ఈ విషయాన్ని అవేరా వ్యవస్థాపక సీఈవో డాక్టర్ వెంకటరమణ 'సాక్షి'కి తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై చర్చలు జరిగాయని చెప్పారు. ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసే ఎలక్ట్రిక్ స్కూటర్లపై సుంకాలు, పన్నులు విధించకుండా భారత్ ప్రభుత్వం త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ఆస్ట్రేలియాలో ఈ-స్కూటర్లను ప్రోత్సహించడానికి కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ ముందుకు వచ్చారని తెలిపారు. తొలుత విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం అవేరాకు చెందిన 100 విన్సిరో ఈ-స్కూటర్లను సరఫరా చేయాలని ఆయన కోరినట్లు వివరించారు. కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ భారత్ పర్యటనలో భాగంగా వచ్చే ఏడాది ఏపీకి వస్తారని, ఆ సమయంలో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు.

బోరుబావి నుంచి అగ్నికీలలు

మధ్యాహ్నానికి ఆగిపోయిన గ్యాస్.. మంటలు

రాజోలు: ఆక్వా చెరువుకు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న 280 అడుగుల లోతు బోరుబావి నుంచి గ్యాస్ భూ ఉపరితలం పైకి వచ్చి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామంలోని మట్టపర్రు రోడ్డులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మట్టపర్రు రోడ్డులో ఆక్వా చెరువులకు నీటి కోసం రైతులు నాలుగేళ్ల కిందట బోరుబావి తవ్వారు. శ్రీనివాస్ అనే రైతు ఈ బోరుబావి నుంచి తన చెరువులోకి నీటిని తోడుతున్నాడు. బోరుబావి నుంచి శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా గ్యాస్ పైకి రావడంతోపాటు మంటలు ఉధృతంగా ఎగసిపడ్డాయి. ఆక్వా రైతులు ఓఎన్జీసీ, రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఓఎన్జీసీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బోరు బావి నుంచి గ్యాస్ వస్తుందని, బావి అడుగున ఉన్న విద్యుత్ మోటారులో సాంకేతిక లోపంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు ఎగసిపడుతున్నాయని నిర్ధారించారు.



బోరుబావి నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

మధ్యాహ్నానికి గ్యాస్ పైకి రావడం ఆగిపోయింది. దీంతో మంటలు కూడా ఆగిపోయాయి. అనంతరం వెంటనే ఓఎన్జీసీ, రాజోలు అగ్నిమాపక సిబ్బంది కలసి ఇసుక, నీటితో బోరుబావిని పూర్తిగా పూడ్చివేశారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలకు చెందిన పైప్‌లైన్లు ఆ ప్రాంతంలో లేవని, అయినప్పటికీ ఈ బోరుబావి నుంచి గ్యాస్ ఎలా వచ్చిందనే విషయాన్ని పరిశీలిస్తామని ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

'చైతన్య' బీఎస్ రావుకు కన్నీటి వీడ్కోలు

పెనమలూరు: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావుకు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడప శ్రీచైతన్య క్యాంపస్ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికకాయాన్ని బందరు రోడ్డు మీదుగా గోసాల క్యాంపస్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమ మజిలీలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఎస్ రావుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గోసాల వ్యవసాయ క్షేత్రంలో బీఎస్‌రావు భౌతిక కాయానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.



బీఎస్ రావు అంతిమయాత్ర దృశ్యం

జిల్లా వార్తలు

పొంగులేటి నియామకంపై సంబురాలు



కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రచార కమిటీ కోచైర్మన్‌గా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాణసంచా కాల్చారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు.

23 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దుచేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు మరికొంత కాలం ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఈ నెల 16వ తేదీ వరకు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించగా, 23వ తేదీ వరకు పొడిగించినట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా వెళ్లే డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756), భద్రాచలంరోడ్ – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలంరోడ్(07279) ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 23 వరకు రద్దు చేసిన విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి గాంధీపురం రైల్వేగేట్ మూసివేత

కారేపల్లి: రోడ్డు మరమ్మతుల దృష్ట్యా కారేపల్లి మండలంలోని గాంధీపురం రైల్వే గేట్(ఎల్‌సీ 5కేకే)ను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై గాంధీపురం రైల్వే గేట్ వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు, ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్లే వాహనాలను కారేపల్లి రైల్వే గేట్ మీదుగా మళ్లిస్తున్న విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు.

'ఉన్నత'మైన ఆలోచన

- చదువు మధ్యలో మానేసిన వారికి వరంలా 'ఓపెన్'
- ఉద్యోగాలు, పదోన్నతులకు ఉపయోగం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 55 అధ్యయన కేంద్రాలు
- పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు వచ్చేనెల 10 వరకు అవకాశం



అభ్యసన కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: గతంలో ఓ వయస్సు దాటాక చదువుపై పెద్దగా ఆసక్తి చూపించకపోయేవారు. అలాగే, చిన్నపాటి ఉద్యోగం వస్తే అంతకు మించి పదోన్నతులు అవసరం లేదనే భావన ఉండేది. కానీ, ఇప్పుడు చదువులో ఉన్నత స్థాయికి చేరాలని.. ఉద్యోగంలో పదోన్నతి పొందాలనే తపన పెరిగింది. ఇవన్నీ కాకుండా కనీస విద్యార్హత తప్పనిసరిగా ఉండాలనే ఆలోచనతో మహిళలు సైతం చదువుకునేందుకు ముందుకొస్తున్నారు. ఇలాంటి వారందరికీ ఓపెన్ స్కూల్ విద్యావిధానం వరంలా మారింది. కనీస విద్యార్హత లేకున్నా తగిన వయస్సు ఉంటే పదో తరగతిలో చేరే అవకాశం ఉండగా.. ఆపై ఇంటర్ కూడా చదువుకునే వెసులుబాటు ఉండడంతో పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.

రెగ్యులర్‌తో సమానంగా గుర్తింపు

రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా ఓపెన్ స్కూల్‌లో చదివిన వారికి కూడా గుర్తింపు లభిస్తుండటంతో చదువు మధ్యలో ఆపేసిన వారు ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. చదువును మధ్యలోనే మానేసిన, కనీస విద్యార్హత లేకున్నా, వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర అవసరాలకు పదో తరగతి అవసరం కావడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. 2008 విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ విధానం ప్రారంభం కాగా.. 2008–09 నుంచి పదో తరగతి, 2010–11 నుంచి ఇంటర్మీడియట్ ప్రారంభించారు. 14 ఏళ్లు దాటిన వారు పదో తరగతికి, 15 ఏళ్లు నిండి పదో తరగతి పాసైన వారంతా ఇంటర్మీడియట్ చదువుకు అర్హత సాధిస్తుండగా.. వారాంతాలు, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

55 కేంద్రాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు మొత్తంగా 55 ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 22, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పాఠశాలల్లో అభ్యసన కేంద్రాలు ఉండగా, ప్రతీ ఆదివారం, ఇతర సెలవు దినాల్లో కూడా బోధన సాగుతోంది. ఫీజు చెల్లించాక పుస్తకాలను ఉచితంగానే అందిస్తున్నారు. ఇదిలా ఉండగా గతేడాది పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన వారిలో పలువురు వయస్సు పైబడిన వారు కూడా ఉండడం ఓపెన్ స్కూల్‌పై ఆసక్తిని తెలియజేస్తోంది.

వచ్చే 10వ తేదీ వరకు గడువు

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు వచ్చే నెల 10వ తేదీలోగా అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా అపరాధ రుసుంతో వచ్చే నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. www.telanganaopenschools.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. లేదంటే మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో సైతం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫీజుల వివరాలు ఇలా..

పదో తరగతికి ఓసీ పురుషులు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీలు, మహిళలు రూ.1,150 చెల్లించాలి. ఇక ఇంటర్మీడియట్‌కు ఓసీ పురుషులైతే రూ.1,800, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగులు రూ.1,500తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత ధ్రువపత్రాలను అధ్యయన కేంద్రంలో సమర్పించాలి.

గత నాలుగేళ్లలో ప్రవేశాలు

ఖమ్మం జిల్లా				
కోర్సు	2019-20	2020-21	2021-22	2022-23
పదో తరగతి	797	1,590	1,154	770
ఇంటర్మీడియట్	742	1,199	1,344	995
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా				
కోర్సు	2019-20	2020-21	2021-22	2022-23
పదో తరగతి	840	1,579	1,426	671
ఇంటర్మీడియట్	607	987	1,093	856

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత చదువులు చదవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ విధానం ఎంతగానో దోహదపడుతుంది. ఆసక్తి ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చిన్నచిన్న పనులు చేసుకుంటున్న వారు, చిరుద్యోగులు, ఇళ్లలో ఉంటున్న మహిళలకు ఇది మంచి అవకాశం. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన పలువురు ఉన్నత విద్య పూర్తిచేసి జీవితంలో స్థిరపడుతున్నారు.

– మద్దినేని పాపారావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

తెలుగు క్రైస్తవ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీకృష్ణ

కల్లూరు: తెలుగు క్రైస్తవ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన తాటి మురళీకృష్ణ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయ్‌కుమార్ ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ శనివారం కల్లూరులో మాట్లాడుతూ క్రైస్తవుల హక్కుల సాధనకు పోరాడుతామని, అన్ని జిల్లాల్లో వేదిక కమిటీలను నియమిస్తామని తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న మురళీకృష్ణ (ఎడమ)

చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు

తల్లాడ: ఎన్‌ఆర్ఐల సహకారంతో చేతన ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడలోని రైతు వేదికలో శనివారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన 150 మంది అనాథ పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాదినేని నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన వెయ్యి మందికి కృత్రిమ కాళ్లు అందజేయడంతోపాటు కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు కూడా ఫౌండేషన్ బాధ్యులు అందజేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ చేతన ఫౌండేషన్‌ను స్థాపించిన వెనిగళ్ల రవి, రేణుక అమెరికాలో ఉంటూనే ఇక్కడ పిల్లలకు చేయూతనివ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్‌తో పాటు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దూపాటి భద్రరాజు, దొడ్డా సీతారామయ్య, ఎం.నరసింహారావు, చంద్రకాని నవీన్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు, నోట్ బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ మధు

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: న్యాయసేవాధికార సంస్థ పరిధిలోని పారాలీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు వ్యవసాయ చట్టాలపై అవగాహన పెంచుకుని రైతులకు అండగా నిలవాలని వ్యవసాయ చట్టాల నిష్ణాతుడు సునీల్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అధ్యక్షతన వ్యవసాయ చట్టాలపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సునీల్ మాట్లాడుతూ.. భూమికి సంబంధించి 124 చట్టాలు, వ్యవసాయానికి సంబంధించి 65 చట్టాలున్నాయని తెలిపారు. రైతు హక్కుల చట్టం, విత్తనాల చట్టం, వినియోగదారుల రక్షణ చట్టాలను వివరించిన ఆయన దోస విత్తనాలు మొలకెత్తని కేసులో సుప్రీంకోర్టు బాధిత రైతులకు రూ.20 లక్షల పరిహారాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే, గ్రామ నక్షా టిపన్, సేత్వారీ రికార్డులు, భూ హక్కులకు సంబంధించి ప్రామాణికాలను తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని వివరిస్తూ 2005 డిసెంబర్ 13కు ముందు అటవీ భూమి ఆక్రమించిన గిరిజనులకు ఆ భూమి పది ఎకరాలకు తక్కువ ఉంటే ప్రభుత్వం పట్టా ఇస్తుందని వివరించారు. సదస్సులో మానేరు న్యాయ కళాశాల విద్యార్థులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల లాభాలు

- రాష్ట్రవ్యాప్తంగా 17 నూతన భవనాలు
- టీఎస్ఎఫ్‌డీసీ వీసీ, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ గతేడాది రికార్డు స్థాయిలో రూ.100 కోట్ల లాభాలు ఆర్జించిందని.. ఈ ఏడాది రూ.200 కోట్లు లాభాలు గడిస్తామనే నమ్మకం ఉందని టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న డివిజన్ కార్యాలయం, క్వార్టర్ల పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 45 ఏళ్ల తర్వాత కార్పొరేషన్‌లో పాత భవనాలు తొలగించి రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జామాయిల్‌కు డిమాండ్ పెరిగిందని, డిసెంబర్‌లో టన్ను రూ.4,500 ఉంటే ఇప్పుడు రూ.6,100కు పెరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గతేడాది 3 లక్షల టన్నుల జామాయిల్ కర్రల విక్రయం, వెదురు ద్వారా రూ.16 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు. అయితే, లాభాల్లో జామాయిల్‌దే ప్రధాన భూమిక అని, అటవీ అభివృద్ధి అధికారులు జామాయిల్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాద్రి డీఎఫ్‌ఓ లక్ష్మణ్‌రంజిత్‌నాయక్, సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.స్కైలాబ్, డీఎం వి.తనూజ, ప్లాంటేషన్ మేనేజర్లు బి.సైదానాయక్, చంద్రకళ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్వార్టర్ల పనులను పరిశీలిస్తున్న టీఎస్ఎఫ్‌డీసీ వీసీ చంద్రశేఖర్‌రెడ్డి